క్లుప్తంగా

మట్టి ఖర్చులకు నగదు అందజేత

పిడుగురాళ్ల: కోటేశ్వరరావు కుటుంబానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. 5వ వార్డులోని 1వ సచివాలయ పరిధిలో గృహసారథిగా ఉంటున్న కోటేశ్వరరావు బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. వారి కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేల నగదును అందజేశారు. కౌన్సిలర్లు బడిగుంతల వెంకట రమణ, కత్తెరపు వాసుదేవరెడ్డి, వార్డు నాయకులు తదితరులు ఉన్నారు.

దత్తత విద్యార్థులకు చేయూత



మాచర్ల: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో దత్తత తీసుకున్న 20 మంది ఉత్తమ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రూ. 26వేల విలువైన విద్యా సామగ్రి, స్టడీ మెటీరియల్‌ను ప్రాజెక్టు డైరెక్టర్ తాటి భాస్కర్ శనివారం అందజేశారు. హెచ్‌ఎంలు రామారావు, అస్సాన్, షకీనా బేగం మాట్లాడుతూ బిగ్ హెల్ప్ సంస్థ విద్యార్థులకు సొసైటీ అధ్యక్షుడు చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఏటా చేయూతనివ్వటం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు జె.గంగాధర్ బాబు, డేవిడ్ విల్సన్, ఆయేషా, రత్నమంజరి, కృష్ణానాయక్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

బియ్యం, మట్టి సేకరణ

పిడుగురాళ్ల: అమరవీరుల త్యాగాన్ని గుర్తించి మట్టి సేకరించటం ఆనందదాయకమని మునిసిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 13వ సచివాలయ పరిధిలోని 24, 26 వార్డుల్లో నా దేశం – నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని స్కాలర్స్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కలశాలతో మట్టి, బియ్యం సేకరించారు. మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..దేశ రాజధాని ఢిల్లీలోని పవిత్ర అమృత వాటికను నిర్మించేందుకు ప్రతీ గ్రామం నుంచి మట్టి, ధాన్యం సేకరించటం జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని 33 వార్డులు, 17 సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టి, బియ్యం సేకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నెం పద్మావతి బంగారురెడ్డి, సచివాలయ అడ్మిన్ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ గురజాలకు సహకరించాలి



గురజాల: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ గురజాలగా మార్చేందుకు కృషి చేయాలని 10వ అదనపు జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కోర్టు భవనాల నందు శనివారం హైకోర్టు ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవలో భాగంగా కోర్టు ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బీఎల్‌వీ శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి డి.షర్మిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జానీ బాష, సుందర జ్ఞానమ్మ, కె.శ్రీనివాస రావు, కర్రా చిన కోటేశ్వరరావు, చాగంటి సురేష్, కె.ప్రభుదాసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



పిడుగురాళ్లరూరల్: పంట నమోదు చేసుకున్న వెంటనే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోనంకి గ్రామంలో రైతులకు ఈ-క్రాప్ నమోదుపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ క్రాప్ బుకింగ్‌తో ఉచిత పంట బీమా, ధాన్యం కొనుగోలు, సున్నా వడ్డీ రుణాలు, పంట నష్టాలు, వ్యవసాయ ఉత్పాదకాల మీద రాయితీలు వర్తిస్తాయన్నారు. రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్స్, 1బి, పట్టాపాస్ పుస్తకం జిరాక్స్ రైతు భరోసా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించాలన్నారు.

పోషకాహార మాసోత్సవ ర్యాలీ

అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామంలో జాతీయ పోషకాహార మాసం ముగింపు సందర్భంగా ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా పోషక మాసోత్సవ ర్యాలీ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి, ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్, పి.లక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ఆరోగ్యానికి రక్ష



రోగులకు ఆరోగ్య రిపోర్టులు అందజేస్తున్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి



నరమాలపాడులో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ దుర్గారావు

దాచేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను శనివారం ప్రారంభించారు. దాచేపల్లి నగర పంచాయతీతో పాటు పలు గ్రామాల్లో శిబిరాలను నిర్వహించారు. నడికుడి ఆరోగ్య కేంద్రంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్ కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్ బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ పి. సుచరిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. గామాలపాడు సచివాలయంలో డీపీఓ ఎంవీ.బాస్కర్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ జంగా సురేష్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ అమూల్య, డాక్టర్ షాహిన్ సుహాన్, డాక్టర్ రఘురామ్, డాక్టర్ చక్రవర్తి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు చాట్ల క్రాంతి కుమార్ నాగుబండి గురువులు, వందనపు వెంకట్రామయ్య, దేవళ్ల లక్ష్మీప్రసన్న, మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, మాజీ ఎంపీటీసీ జంగా సైదులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన

మాచర్ల: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని లక్షల మందికి వారి సొంత గ్రామాల్లోనే వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు బజారులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, వైద్యాధికారులతో కలిసి పీవీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు మిన్నగా మెరుగైన వైద్యాన్ని పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో పది మంది వైద్యులు దాదాపు 1,500ల మందికి వైద్య పరీక్షలు అందించారు. ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంఆర్‌ఎఫ్ రామాంజనేయరెడ్డి, నాగుల్ మీరా, గట్ల కోటిరెడ్డి, అరుణ, పురపాలక సంఘ అధికారులు పాల్గొన్నారు.

నరమాలపాడులో..

కారెంపూడి: మండలంలోని నరమాలపాడు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. గ్రామంలోని పాఠశాలలో 600 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలందించారు. డాక్టర్ నాగేంద్రబాబు ఎండీ జనరల్, డాక్టర్ బి.రఘుప్రసాద్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ బి.దుర్గారావు, డాక్టర్ ఆర్. విజయానాయక్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు సూచించిన మందులను శిబిరంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల ప్రత్యేక అధికారి జోసెఫ్ కుమార్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ కసిన్యానాయక్, డీటీ కీర్తి సుధా స్రవంతి పాల్గొన్నారు.



గామాలపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

గోలి గ్రామంలో..

రెంటచింతల: మండలంలోని గోలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. అధికారులతో కలిసి ఎంపీపీ దాసరి చౌడేశ్వరి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ మున్నా చంద్రం, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, జేజేఎస్ కో-ఆర్డినేటర్ మోర్తల ఉమ, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, ఎంపీటీసీ రమావత్ సీతమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, డాక్టర్ వాసు, డాక్టర్ సుజనారెడ్డి, డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ అనంత కోటేశ్వరరావు పాల్గొన్నారు.

374 మందికి వైద్య పరీక్షలు

మాచవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మాచవరం సచివాలయం-1 పరిధిలో శనివారం నిర్వహించారు. 374 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ఆర్థో, ఫ్యామిలీ ఫిజీషియన్ సంబంధించి సుమారు 15 మందిని హాస్పిటల్‌కు రెఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీడీఓ యు.ప్రసాద్ వైద్యులు ప్రసాద్, సీహెచ్ అనూష, అశోక్, అన్వేష్, చంద్రహాసిత, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, మండల కో-ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ జానీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు

పిడుగురాళ్లరూరల్: మండలంలోని పాతగణేశునిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్లు ఐదు బృందాలుగా గ్రామీణ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులను అందజేశారు. 51 మందిని మెరుగైన వైద్యం కోసం హాస్పిటల్స్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైద్యులు డాక్టర్ ప్రభావతి, ప్రభాకర్‌రెడ్డి, చైతన్య, శ్రావణి, ప్రవీణ్‌రెడ్డి, మున్నీర్ అహ్మద్, సర్పంచ్ రోశయ్య, వైస్ చైర్మన్ అంగడుల సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష..సురక్ష

గురజాల : ప్రజలకు రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం అర్బన్ హెల్త్ క్లీనిక్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్కుయి, వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, నగర పంచాయతీ కమిషనర్ ఎ. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

వెల్దుర్తి: మండలంలోని మండాదిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఎంపీపీ చింతా శివరామయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 187 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు ఎంపీపీ తెలిపారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఉన్న ఆసుపత్రులకు ఉచితంగా తీసుకెళ్లి వైద్యం అందించటం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ కేతావత్ రూప్లీ బాలునాయక్, మండల స్పెషలాఫీసర్ జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ శీలం సైదారెడ్డి, ఎంపీటీసీ పి.కాంతారావు, ఎంపీడీఓ డి.ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొజ్జా అంజిబాబు, నర్సరావుపేట సాయి దత్త హాస్పిటల్ వైద్యులు వేణుగోపాల్, మాచర్ల వైద్యులు ఆశీర్వాదం, ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యులు శ్రీరామ్, ముఖర్జీబాయి, శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిజాముద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

దుర్గి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం మండలంలోని అడిగొప్పల గ్రామంలో ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమందలు ప్రారంభించారు. వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్, మందులు అందజేశారు. శిబిరానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జి.రమేష్‌కుమార్, స్పెషలాఫీసర్ కె.సంజీవరావు, ఎంపీడీఓ కె.సమతావాణి, సర్పంచ్ నలబోతు చిన్నబ్బాయ్, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, గ్రామ సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.



గోలి గ్రామంలో వైద్య శిబిరంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు



మాచవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఆంజనేయులు



మండాదిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైఎస్సార్ సీపీ రెంటచింతల అధ్యక్షుడిగా బ్రహ్మారెడ్డి

రెంటచింతల: వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడిగా నియమిస్తూ.. మండలంలోని పశర్లపాడు గ్రామానికి చెందిన గొట్టం చిన బ్రహ్మారెడ్డిని శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు అందాయి. 2014 నుంచి పార్టీ మండల యూత్ అధ్యక్షునిగా ఆయన పనిచేస్తున్నారు. 2009లో మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. తన ఎంపికకు కృషి చేసిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇంచార్జి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మాచర్ల పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

మాచర్ల: కౌన్సిలర్ పోలా శ్రీనివాసరావును మాచర్ల పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనకు శనివారం అభినందనలు తెలిపారు.

మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా పాపిరెడ్డి

వెల్దుర్తి: మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా వెల్దుర్తి గ్రామానికి చెందిన కోట్ల పాపిరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించారన్న పాపిరెడ్డి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో నిరసన దీక్షలకు అనుమతి లేదు

కారెంపూడి: ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రభుత్వ స్థలాల్లో నిరాహార దీక్షా శిబిరాలు, ధర్నాలు ఇతర ఆందోళన కార్యక్రమాలకు అనుమతులు లేవని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ శనివారం తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయం ఎదుట ఆర్‌అండ్‌బీ రోడ్డులో దీక్ష చేస్తున్న టీడీపీ నాయకులకు నోటీసులు ఇచ్చి, తొలగించాలని ఎస్‌ఐ రామాంజనేయులును ఆదేశించినట్లు చెప్పారు. గతంలో ఇదే ఆందోళనను వారు ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తే పోలీస్ శాఖ అభ్యంతరం పెట్టలేదని గుర్తుచేశారు. వారి పార్టీ అధినేత జైలు నుంచి విడుదల అయ్యే వరకు రోడ్డు పక్క దీక్షలు చేస్తామంటే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. పార్టీలతో తమకు పని లేదని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఎవరు ఆందోళనకు దిగినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరికి సచివాలయ ఉద్యోగుల వివరాలు

- పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు
- పిడుగురాళ్ల మునిసిపల్ సాధారణ సమావేశం..



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: సచివాలయ ఉద్యోగుల వివరాలను ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో శానిటేషన్ సరిగా లేదని అధికారులకు చెప్పారు. 16వ వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి మాట్లాడుతూ చెరువు కట్ట వద్ద ఉన్న మునిసిపల్ కార్యాలయ వాహనాల కోసం చుట్టూ ప్రహరి నిర్మించి, నూతన షెడ్డును ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సుమారు రూ. 2 కోట్ల విలువ చేసే వాహనాలు అక్కడ ఉన్నాయని తెలిపారు. పిల్లుట్ల బైపాస్ రోడ్డులో నాలుగు కూడళ్ల మధ్య ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. 9వ వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్ ఎదురుగా రహదారి మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తమ వార్డులో శానిటేషన్ సిబ్బంది ఇద్దరుంటే.. ఒక్కరు మాత్రమే విధులకు వస్తున్నారని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. 7వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి మాట్లాడుతూ తమ వార్డులో పైపు లైన్ల పనుల కోసం అండర్ గ్రౌండ్ గుంతలు తీశారని, వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. 2వ వార్డు కౌన్సిలర్ కౌన్సిలర్ కొక్కెర శ్రీనివాసరావు పైపులైన్ల కోసం కల్వర్ట్ వద్ద తీసిన గుంతలను తిరిగి వెంటనే గుంతలను పూడ్చి పనులను పూర్తి చేయాలని కౌన్సిల్ దృష్టికి తీసుకొని వచ్చారు. కౌన్సిలర్లు గుర్రం అప్పిరెడ్డి, అన్నెం పద్మావతి, షేక్ సైదావలి తమ వార్డుల్లోని సమస్యలను వివరించారు. మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

సత్తెనపల్లి: మండలంలోని కంకణాలపల్లి రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని గ్రామ సర్పంచ్ చెరుకూరి వణురు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిమిత్తం శనివారం రైల్వే అధి కారులు రావడంతో గ్రామస్తులు అందరూ కలసి అడ్డుకున్నారు. సత్తెనపల్లి ఆర్డీలో బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ ఎస్.సురేష్‌లకు దాని వల్ల కలిగే నష్టాలను గ్రామస్తులు వివరించి వినతి పత్రం అందించారు. దీని నిర్మాణం వల్ల గ్రామానికి తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.

టీఎస్ నగర్‌లో 12 అడుగుల కొండచిలువ



రాజుపాలెం: మండలంలోని కొండమోడు సమీపంలోని టీఎస్ నగర్‌లో శనివారం 12 అడుగుల కొండచిలువ రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు డీఆర్వో పి.నీలిమాదేవి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘటనా స్థలానికి బీట్ అధికారులైన ఎస్.గోవిందరాజు, కె.మరియదాసు, ఎస్కే బాషా వచ్చారు. వారు వెంటనే ఆ కొండచిలువను గోతంలో పట్టుకుని జానపాడు అడవి ప్రాంతంలో వదిలిపెట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి



నార్నెపాడులో ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కల్పిస్తున్న అమలకుమారి

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయం, నిరంతర ఆదాయాన్నిచ్చే మోడల్ అని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి తెలిపారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు కాకుమాను పూజ వ్యవసాయ పొలంలో ఏటీఎం విధానంలో సాగుపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ఏటీఎం మోడల్ ద్వారా పండించిన ఆహారం తినడం వలన ప్రజలు రోగాల బారిన పడకుండా పర్యావరణం దెబ్బతినకుండా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించవచ్చన్నారు. ఈ విధానంలో కావలసిన విత్తనాలు ముందుగా బీజామృతంతో విత్తన శుద్ధి చేసి బెడ్స్ మీద 4 అంగుళాల దూరంలో గీతలు గీస్తూ, మొదటి వరుసలో ముల్లంగి, రెండో వరుసలో బీట్‌రూట్, మూడో వరుసలో క్యారెట్, నాలుగో వరుసలో ఆకుకూరలు వేస్తూ ప్రతి వరుసలో ఘనజీవామృతం వేసినట్లు వివరించారు. ప్రతి నెల ఒక పంట తర్వాత పంట రైతుకు చేతికి అంది డబ్బులు రావటం జరుగుతుందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని చెప్పారు. ఈ మోడల్ ద్వారా ప్రయోగాత్మకంగా విత్తనాలు విత్తి రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలోని చెన్నుపాటి వెంగళమ్మ ఇంటి వద్ద ప్రకృతి పద్ధతిలో సాగు చేస్తున్న న్యూట్రీ గార్డెన్‌లో మొత్తం 15 రకాల ఆకు కూరలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ నంద కుమార్, యూనిట్ ఇన్‌చార్జి మధు, రాజు, అమూల్య పాల్గొన్నారు.

విద్యార్థినులు అవగాహనతో రాణించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: విద్యార్థినులు అవగాహనతో అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ సౌజన్యంతో నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రోత్సాహంతో విజ్ఞాన్ యూనివర్సిటీ డీన్, విజ్ఞాన సంస్థల్లోని విద్యా వలంటీర్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను శనివారం సందర్శించి విద్యార్థినిలకు బాల్యవివాహాలు, లింగ వివక్షత, క్యాన్సర్, విద్య యొక్క ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి -2 రాఘవేంద్రరావు, ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత పాల్గొన్నారు.

అదృశ్యంపై ఫిర్యాదు

క్రోసూరు: క్రోసూరుకు చెందిన విస్సంసెట్టి మహేష్‌బాబు రెండు రోజులుగా కనబడటం లేదని అతడి కుమారుడు నాగసాయిరాజశేఖర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, వయస్సు 51, సామనఛాయ రంగు కలిగి ఎర్రరంగు టీషర్టు, బ్లూషార్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9502072750, 9014040791కు తెలియచేయాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం: మాచవరంలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాల్లో పిడుగురాళ్ల సహాయ వ్యవసాయ సంచాలకుడు బి. శ్రీకృష్ణదేవరాయలు శనివారం తనిఖీలు చేపట్టారు. డీలర్ల లైసెన్సులు, రైతులకు విక్రయించిన బిల్లులను పరిశీలించారు. కొనుగోలుదారులకు ఫోన్లు చేసి, ఆయా దుకాణాల్లో రైతులు ఏఏ పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేశారో విచారించారు. దుకాణాల్లో కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు వెంటనే అందించాలని దుకాణదారులకు సూచించారు. ఓ-ఫాం ఉన్న ఎరువులు, అనుమతులు ఉన్న పురుగు మందులు మాత్రమే అమ్మకాలు జరపాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ కె.రామమ్మ, వ్యవసాయ శాఖ సిబ్బంది జి.దివ్య, కె.కరుణ, ఎం.నర్సయ్య పాల్గొన్నారు.

కృష్ణానదిలో యువకుడి మృతదేహం లభ్యం



మృతుడు దుగ్గరాజు సాయి ప్రమోదు(ఫైల్)

గురజాల : గొట్టిముక్కల పుష్కర ఘాట్ నందు కృష్ణానదిలో యువకుడి మృతదేహం శనివారం లభించింది. వివరాల మేరకు.. గురజాలకు చెందిన దుగ్గరాజు సాయి ప్రమోద్ (43) శుక్రవారం మధ్యాహ్నం పురుగు మందు సేవించి, గొట్టిముక్కల పుష్కరఘాట్‌కు 3 కిలోమీటర్ల దూరంలో నదిలో పడ్డాడు. శనివారం మధ్యాహ్నం బేడబుడగ జంగం కాలనీ వాసులు చేపలు పట్టుకునేందుకు వెళ్లగా నదిలో అతని మృతదేహం తేలాడుతూ కనిపించింది. సమాచారం అందడంతో.. పోలీసులు జాలర్ల సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత బుధవారం దుగ్గరాజు సాయి ప్రమోదు తండ్రి ప్రకాశరావు అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి అస్థికలు కృష్ణానదిలో కలిపి, తండ్రి మరణం జీర్ణించుకోలేక మృతి చెందినట్లు అతని స్నేహితులు చెప్తున్నారు. మృతుడు దుగ్గరాజు సాయి ప్రమోదు హైదరాబాద్ నందు సాక్షి నందు అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి వివాహం కాలేదు.

పంట పొలాల్లో కేఎల్ శాట్-1 పరికరం లభ్యం



పంట పొలాల్లో దొరికిన యూనివర్సిటీ శాటిలైట్ పరికరం

క్రోసూరు: వాతావరణంలో వస్తున్న మార్పులు తెలుసుకునేందుకు కేఎస్ యూనివర్సిటీ ఈనెల 27న బెలూన్ శాటిలైట్ ప్రయోగించగా దానికిలోని ఒక పరికరం మండలంలోని ఊటుకూరు గ్రామ పొలాల్లో పడింది. దానిని వెతుకులాడుతున్న క్రమంలో యూనివర్సిటీ అధికారులకు ఊటుకూరులో ఉన్నట్లు సమచారం అందటంతో వారు చేరుకుని శనివారం తీసుకెళ్లారు. అధ్యాపకులు, విద్యార్థులు రైతులకు ఉపకరించేలా వాతావరణ మార్పులు తెలుసుకునేందుకు మరో తొమ్మిది దేశాల సాంకేతిక పరికరాలతో రూ.2.75లక్షల వ్యయంతో భూమి నుంచి 35 కిలోమీటర్ల ఎత్తుకు ప్రయోగించినట్లు సమాచారం. దాని పరికరం ఊటుకూరు రైతు జెర్రిపోతు మరియదాసు పొలంలో పడగా అతను యూనివర్సిటీ వారికి అందజేశాడు.